క్లుప్తంగా

అయ్యప్పకు అలంకరణ



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని బలగలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి క్షీరాభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు దేవరకొండ శంకర నారాయణ శర్మ, మణిదీపక్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వర్సిటీ విద్యార్థులు, సిబ్బందికి క్యాన్సర్ స్కీనింగ్ పరీక్షలను బుధవారం నిర్వహించారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి (విశాఖ) వారి సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని వర్సిటీ వీసీ కె.ఆర్.రజనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న జీవన శైలీ, వాతావరణంలో మార్పులు, గాలి, నీటి కాలుష్యం, ఆరోగ్య అలవాట్లలో మార్పులు వలన క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారన్నారు. విద్యార్థి దశ నుంచే ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి స్క్రీనింగ్ పరీక్షలను చేయించుకుంటే ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించవచ్చునన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనురాధ, ఎస్‌వో డాక్టర్ కె.సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాన్న వెంకటేష్‌కు అభినందనలు



వెంకటేష్‌ని సత్కరిస్తున్న సూరిబాబు తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శర్వాణి విద్యాలయ పూర్వ విద్యార్థి బాన్న వెంకటేష్ యూపీఎస్సీ సివిల్స్ ఆల్ ఇండియా 15వ ర్యాంక్ సాధించడం అభినందనీయమని శర్వాణి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ కళింగ వైశ్యకుల రాష్ట్ర అధ్యక్షుడు అందవరపు సూరిబాబు అన్నారు. బాన్న వెంకటేష్ అభినందన సభను స్కూల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, హెడ్మిస్ట్రెస్ కె.రేఖ, విశ్రాంత ప్రధాన ఆచార్యులు నిక్కు అప్పన్న, న్యాయవాది కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మురపాక మండలం ఏర్పాటుపై వినతి

రణస్థలం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జిల్లాలు, మండలాల పునః వ్యవస్థీకరణపై వేసిన క్యాబినెట్ సబ్ కమిటీకి మురపాక మండల ఏర్పాటుపై మురపాక మండల సాధన సమితి సభ్యులు వినతిపత్రం అందజేశారు. అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో మొదటిసారి సమావేశమైన కమిటీ మంత్రులను ఎంఎంఎస్ సభ్యులు బుధవారం కలిశారు. మురపాక మండల ఏర్పాటు ఆవశ్యకతను క్యాబినెట్ సబ్ కమిటీకి వివరించారు. కార్యక్రమంలో శ్రీవివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షుడు బాలి శ్రీనివాసనాయుడు, సామాజిక కార్యకర్త మీసాల భానుజీరావు, పేరూరి గురునాథ్, నాజాన లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గంగరాజు

గార: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సీహెచ్ గంగరాజు సూచించారు. మండల కేంద్రంలో వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే అపరాధ రుసుము విధించడం జరుగుతుందని హెచ్చరించారు.

కాలువలు వెలవెల..

రైతులు విలవిల

- సాగునీరు అందక ఎండిపోతున్న పొలాలు
- ఆందోళనలో వరి, మొక్కజొన్న రైతులు
- పట్టించుకోని పాలకులు

సాగునీరు అందక రైతులు విలవిల్లాడుతున్నారు. కళ్లముందే పంటలు ఎండిపోతుండటంతో ఆందోళనకు గురవుతున్నారు. వేసవికి దీటుగా ఎండలు మండుతుండటం, కాలువలు చుక్కనీరు లేకుండా బోసిపోవడంతో ఏం చేయాలో తోచక సతమతమవుతున్నారు. ఇంత జరుగుతున్నా కూటమి పాలకులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంపై మండిపడుతున్నారు.



కుమ్మరిపేట వద్ద పిచ్చిమొక్కలతో నిండిన గార కాలువ

సాగునీరు లేని గారబట్టి


గార : మండలంలోని భైరిదేశిగెడ్డ ఛానల్ తంగుళ్లపేట వద్ద నుంచి గార బట్టి కాలువకు సాగునీరు రాకపోవడంతో వరి పంట ఎండిపోతోంది. ఈ కాలువ ద్వారా తూలుగు ప్రాంతంలో కొంత మేర జల్లువలస, గార, కుమ్మరిపేట, ఆరంగిపేట, కొర్ని ప్రాంతాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఈ ప్రాంతంలో సుమారు 600 ఎకరాల్లో వరి సాగవుతోందని అంచనా. దాదాపు 20 రోజులుగా వర్షాలు కురవకపోవడం, ఎండలు విపరీతంగా ఉండటంతో భూమి వేడెక్కి వెద మొక్కలు సైతం చనిపోతున్నాయి. వరి నారు మడులు వేసిన రైతులు బోర్లు, ఇంజిన్ల ద్వారా ఆకు కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. భైరిదేశిగెడ్డ ఇంజినీరింగ్ అధికారులు కాలువలోకి సాగునీరు వచ్చేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కాలువలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయని, పూడిక తీత పనులు చేపట్టాలని కోరుతున్నారు.



లావేరులో ఎండిపోయిన మొక్కజొన్న పంట

ఎండిపోయిన మొక్కజొన్న

రణస్థలం: వేసవిని తలపించేలా ఉన్న ఎండల తీవ్రతకు వరితో పాటు మొక్కజొన్న పంటలు ఎక్కడికక్కడే ఎండిపోతున్నాయి. లావేరు, రణస్థలం మండలాల్లో వర్షాభావ పరిస్థితులు రైతులకు కన్నీరు తెప్పిస్తున్నాయి. మద్దువలస, తోటపల్లి కాలువల ద్వారా సాగునీరు రాక, వర్షాలు లేక రైతుల పడుతున్న బాధలు వర్ణనాతీతం. రైతన్నల బాధలు కూటమి పాలకులు పట్టించుకునే నాథుడే కరవైనందుకు దేవుడిపైనే భారం వేస్తున్నారు.



జగన్నాథవలసలో బీటలు వారిన పొలం



మర్రివలసలో పొలం దుస్థితి

బీటలువారిన పొలాలు..

జి.సిగడాం : వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు మదుపులు పెట్టి పంటలు వేసుకుంటే వర్షాలు పడక పొలాలు బీటలు వారుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో వర్షాలు లేకన నాట్లు వేయలేదు. మరికొన్ని చోట్ల నారు ముదిరిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జి.సిగడాం మండలంలో 42 రెవెన్యూ గ్రామాల్లో సుమారు 12 వేల ఎకరాల్లో వరి సాగు చేయవల్సి ఉండగా ఇప్పటి వరకు 3,500 ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నట్లు సమాచారం.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ



మాట్లాడుతున్న గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కూటమి ప్రభుత్వం ఖూనీ చేసిందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మండిపడ్డారు. మండలంలోని దవళపేట గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పులివెందులలో సజావుగా జరగాల్సిన ఎన్నికలను టీడీపీ మూకలు హింసాత్మకం చేసి, పోలీసుల సాయంతో రిగ్గింగ్‌కు పాల్పడ్డారని దుయ్యబట్టారు. పోలీసుల సమక్షంలోనే ఇటువంటి దాడులు జరిగితే సామాన్య ప్రజలకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. అధికారం చేపట్టిన ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేసి రెడ్ బుక్ రాజ్యాంగం నడిపిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఎన్నికల హామీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, కంచరాన రమణరావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, మాజీ డైరెక్టర్ పేడాడ శ్యామలరావు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఈసర్ల గోవిందరావు, ఐటీ వింగ్ అధ్యక్షుడు చిత్తిరి మోహనరావు, కార్యకర్తలు చింతాడ వెంకటరమణ, పేడాడ కృష్ణంరాజు, పేడాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఉల్లివలసలో పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండల పరిధిలోని పలువురి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఉల్లివలస గ్రామానికి చెందిన మామిడి బలరాం తండ్రి రాములు ఇటీవల మృతి చెందారు. అలాగే నిద్దాం గ్రామ మాజీ సర్పంచ్ ఏర్నేన సాక్షి గోపాలనాయుడు ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, వైస్ ఎంపీపీ మీసాల రాంబాబు, సర్పంచ్‌లు చందక సతీష్, మునగపాటి అదిత్య వర్మ, మామిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

15న కృష్ణాష్టమి వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: ఈనెల 15వ తేదీన సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఇలిసిపురం సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న బ్రహ్మకుమారీస్ ప్రాంగణంలో కృష్ణాష్టమి వేడుకలు జరుగుతాయని బ్రహ్మకుమారీలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా శ్రీకృష్ణుని వేషధారణలు, అలంకరణలు, గుజరాతీపేట రాజరాజేశ్వరి కోలాట బృందం చే కోలాటం, శ్రీకృష్ణుని రాసలీలలు ఆకర్షణగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

పంద్రాగస్ట్ వేడుకలకు ఏర్పాట్లు షురూ..!



ముస్తాబవుతున్న ప్రధాన వేదిక



మైదానాన్ని చదును చేస్తున్న దృశ్యం



మాక్ డ్రిల్ కోసం మార్కింగ్‌లు వేస్తున్న సిబ్బంది



సిద్ధమవుతున్న శకటాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు షురూ అయ్యాయి. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా శుక్రవారం జరగనున్న జిల్లాస్థాయి వేడుకలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రతిష్టాత్మకంగా భావించి, ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో పలుమార్లు సమీక్షించారు. ప్రధాన వేదికతోపాటు వీఐపీలు, వీవీఐపీలు, ప్రెస్ అండ్ మీడియా, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వాతంత్ర్య సమరయోధులు, వీక్షకులు ఇలా వేరు వేరుగా గ్యాలరీలను సిద్ధం చేస్తున్నారు. వివిధ శాఖల పనితీరును ప్రతిబింబించే స్టాల్స్ సిద్ధం చేస్తున్నారు. కాగా జిల్లాకు చెందిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిసింది.

సిద్ధమవుతున్న శకటాలు

మరోపక్క వివిధ శాఖల ప్రగతిని ప్రదర్శించే శకటాలు సిద్ధమవుతున్నాయి. డ్వామా, పంచాయతీరాజ్, సమగ్రశిక్ష–విద్యాశాఖ, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, వివిధ సంక్షేమ శాఖలు శకటాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. మరోపక్క పోలీసులు మాక్‌డ్రిల్‌తో పాటు గౌరవ వందనం సమర్పణ కోసం సన్నద్ధమవుతున్నారు. విద్యార్థులు సైతం మాక్‌డ్రిల్ కోసం ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో శిక్షణ పొందుతున్నారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకునేందుకు నృత్య శిక్షకులు నేతృత్వంలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కేంద్రీయ విద్యాలయం జాతీయ రహదారి మీదుగా పెదపాడు వెళ్లేందుకు గార మండలం కండివలసకు చెందిన వెలమశెట్టి ఆదినారాయణ సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా, శ్రీకాకుళం నుంచి ఒడిశా వెళ్లే ఐషర్ వ్యాన్ కేంద్రీయ విద్యాలయం వద్ద ఒక్కసారిగా ఢీకొంది. దీంతో బాధితుడి తల, చేయికు తీవ్ర గాయాలవ్వడంతో స్థానికులు రిమ్స్‌కు తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని కాకతీయ కళాశాలలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్, లీడ్ బ్యాంకు, రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ అక్షరాస్యత శాతం 80కు పైగా ఉన్నప్పటికీ, ఆర్థిక అక్షరాస్యత కేవలం 27శాతం మాత్రమే ఉందన్నారు. అనంతరం బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు, కో–ఆర్డినేటర్ హరనాథ్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పంటలపై అవగాహన



జీవ వైవిధ్య పంటలు వేస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

రణస్థలం: మండలంలోని రావాడ గ్రామంలో వరిలో జీవ వైవిధ్య పంటలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందరరావు మాట్లాడుతూ.. వరి లైన్ పద్ధతుల్లో నాటడం వలన జీవ వైవిధ్య పంటలను పండించవచ్చునన్నారు. ఎకరా వరిలో పెసలు, మినుములు, ఉలవలు, కట్టె జనుము, గోంగూర, తోటకూర వంటి విత్తనాలు వెద పద్ధతిలో నాటడం వలన అదనపు ఆదాయం లభిస్తుందని చెప్పారు. దీనివలన కలుపు, నీటి వినియోగం, హరిత వాయువుల విడుదల తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సన్నద్ధమవ్వాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సన్నద్ధమవ్వాలని సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, రైతు సంఘం జిల్లా నాయకురాలు కె.పుణ్యావతి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఎస్‌కేయూ, ప్రజా సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు క్విట్ కార్పొరేట్ నినాదంతో నగరంలోని రామలక్ష్మణ జంక్షన్ నుంచి సూర్య మహల్ వరకు బైక్ ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రద్దయిన 3 నల్ల చట్టాలు కంటే ప్రమాదకరమైన విధానాలను ప్రకటించిందని విమర్శించారు. ఎరువులు, వ్యవసాయ పరికరాలపై సబ్సిడీలు కోత విధించిందని మండిపడ్డారు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లు, వ్యవసాయ కార్మికుల రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఏఐటీయూసీ నాయకుడు టి.తిరుపతిరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, ఆల్ పెన్షనర్స్ – రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.ఆదినారాయణమూర్తి, కళాసీ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కె.సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



శ్రీకాకుళం రూరల్: నైరాలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



గార: ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



జి.సిగడాం: మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం



రణస్థలం: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్, అధికారులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ బుధవారం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డా.జి.జోగినాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాతో నినాదాలు తీశారు. హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డా.కె.రవికుమార్, డా.వి. శ్రీనివాసరావు, డా.పి.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గార: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని మండల బీజేపీ అధ్యక్షురాలు మైలపిల్లి లక్ష్మీజనార్దన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. గార సెంటర్ నుంచి సంత తోట వరకు ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సభ్యుడు పండి యోగేశ్వరరావు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఆరంగి తిరుపతిరావు, గుడేటి శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, రాజు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండల కేంద్రంలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండాలను ఎగురవేయాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పైల విష్ణుమూర్తినాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు బీజేపీ కార్యకర్తలతో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వజ్జిపర్తి రఘురాం, సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ వికసిత్ భారత్ కన్వీనర్ మీసాల రామకృష్ణంనాయుడు, గోవిందరావు, ముద్దాడ త్రినాథరావు, ముద్దాడ గౌరీ, అప్పలరాజు, శంకరావు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రణస్థలం: ప్రతి ఒక్కరూ జాతీయ భావం కలిగి ఉండాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని అధికారుల సమక్షంలో చేపట్టారు. ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులతో రామతీర్థాల కూడలి నుంచి ఎస్బీఐ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జేఆర్‌పురం సర్కిల్ పరిధిలో ఉన్న పోలీసు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్ వేయాలి



ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు, ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే పీఆర్‌సీ కమిషన్‌ను తక్షణమే వేయాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.అప్పయ్య డిమాండ్ చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండు రోజుల ధర్నా కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన బుధవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ.. ప్రధానంగా ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. విజయవాడలోని గవర్నర్‌పేట 2వ డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లులూ సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని, విశాఖపట్టణం స్టీల్‌ప్లాంట్ డిపో తరలించడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. వేతన సవరణ గడువు పూర్తయి రెండేళ్లు పూర్తయినందున తక్షణమే ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలని, ఆర్టీసీలో రిటైర్ అయిన ఉద్యోగులకు గ్రాట్యూటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపులు తక్షణమే చేయాలని కోరారు. ఆర్టీసీలో సుమారు 8వేల ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని, గత నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులు వెంటనే ఇవ్వాలని విన్నవించారు. ప్రభుత్వ జీవో ప్రకారం మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పారదర్శకమైన బదిలీల పాలసీను అమలు చేయాలని, రిటైర్ అయిన ఆర్టీసీ ఉద్యోగుల దంపతులకు సూపర్‌లగ్జరీ బస్సుల్లో ప్రయాణాలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు ఎంఆర్ మూర్తి, పి.నవీన్‌బాబు, ఎంఎస్ రాజు, కె.లక్ష్మణరావు, కె.నర్సింహులు, పార్వతి, సునీత, శ్రీదేవి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



ఉత్సాహంగా సాగుతున్న కబడ్డీ పోటీలు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వివిధ అంశాల్లో ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, స్కిప్పింగ్, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీలతో పాటు వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్, చిత్రలేఖనం, పాటలు ఇలా వివిధ అంశాలలో ముమ్మరంగా పోటీలు కొనసాగుతున్నాయి. ఆయా విద్యాసంస్థల హెచ్ఎంలు, ప్రిన్సిపాల్స్ పర్యవేక్షణలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఈనెల 15వ తేదీన జరిగే జెండా పండుగ వేడుకల్లో బహుమతులను అందజేయనున్నారు. – శ్రీకాకుళం న్యూకాలనీ

ముగిసిన వర్క్‌షాపు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల: మండలంలోని చిలకపాలేం శ్రీశివానీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో డేటా స్ట్రక్చర్ అండ్ ఆల్గరిథమ్స్‌పై బ్రోనోవిజన్ వారిచే నిర్వహించిన వర్క్‌షాప్ అండ్ హ్యాక్‌థాన్ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి బ్రోనోవిజన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ కంపెనీ నుంచి నలుగురితో కూడిన బృందం విచ్చేసింది. విద్యార్థులకు ఉద్యోగానికి కావాల్సిన టెక్నికల్ స్కిల్స్ మరింత పెంపొందించడానికి ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందని బ్రెయిన్ విజన్ రీసోర్స్ పర్సన్ సాయి పవన్ పేర్కొన్నారు. 10 రోజులుగా జరిగిన ఈ వర్క్‌షాప్‌లో అమెజాన్, బోస్, గూగుల్ వంటి ప్రొడక్ట్ బేస్డ్ కంపెనీలకు ఉపయోగపడే పైతాన్ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.టి.చంద్రశేఖర్, డిప్లమో ప్రిన్సిపాల్ ఎస్వీఎస్ సునీల్‌కుమార్, హెచ్‌వోడీలు వై.జగదీష్‌కుమార్, పి.ప్రదీప్, కో–ఆర్డినేటర్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.